
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 2 జూలై 2024



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	32	27
భద్రాద్రి	30	22



ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి తుమ్మల

బాధ్యతగా పని చేయండి...

- ప్రజల కోసమే ఉన్నాం... వారి కోసమే పనిచేయాలి...
- అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హితవు
- రఘునాథపాలెం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష

వివరాలు : 6లో



మధిరకు కొత్తకళ

- ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ హబ్ మంజూరు
- రెండింటికీ కలిపి 86 ఎకరాలు కేటాయింపు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

6

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

- సీతారామ ప్రాజెక్టు లింకు కాల్వ పనుల పరిశీలన
- 'పాలేరు' అభివృద్ధి పనులపై సమీక్ష
- ఉదయం నుంచి సాయంత్రం వరకు షెడ్యూల్



కూసుమంచి, జూలై 1: మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మంగళవారం రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు మహబూబాబాద్ జిల్లా తొడేళ్లగూడెం వద్ద సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న పాలేరు లింక్ కాల్వను పరిశీలిస్తారు. 10 గంటలకు పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం చేరుకుని సీతారామ ప్రాజెక్టు పాలేరు లింక్ కెనాల్ ఆకేరు జలధారను సందర్శిస్తారు. 11 గంటలకు దమ్మాయిగూడెంలో సొరంగం కాలువ ప్రవేశ భాగాన్ని పరిశీలిస్తారు. 11:30 గంటలకు బీరోలు కెనాల్ సొరంగాన్ని పరిశీలిస్తారు. 12:30 గంటలకు కూసుమంచి మండలం పోచారం కెనాల్ సొరంగం నిష్క్రమణ భాగాన్ని, 1:30గంటలకు నర్సింహులగూడెం గ్రావిటీ కెనాల్‌ను పరిశీలిస్తారు. 3 గంటలకు కూసుమంచి క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. కాగా మంత్రి పర్యటనకు వివిధ శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మంత్రి బిజీ బిజీగా గడపనున్నారు.



పురుగుల మందు డబ్బాతో ప్రభాకర్

పొలం నాశనం చేశారంటూ...

వీడియోలో గోడు వెళ్లబోసుకుని రైతు ఆత్మహత్య

- ఖమ్మం నగర సమీపంలోని మామిడితోటలో ఘటన
- మృతుడు చింతకాని మండలం పొద్దుటూరు వాసి
- అది సెల్ఫీ వీడియోనా..? మరెవరైనా తీశారా..?
- ఘటన జరిగిన తీరుపై పలు రకాల అనుమానాలు

చింతకాని, జూలై 1: తనకున్న ఏడెకరాల భూమిలో మూడెకరాల భూమిని కొంతమంది కక్షతో పొక్లెయిన్లతో తవ్వి నాశనం చేశారని, ఈ విషయాన్ని తాను ఏ అధికారికి చెప్పుకున్నా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ... ఓ రైతు వీడియో రికార్డు చేసి ఆ తరువాత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ వీడియో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరాలని, తన కుటుంబానికి న్యాయం జరగాలని విన్నవించుకున్నాడు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన బోజెడ్ల ప్రభాకర్ (45)అనే రైతు సోమవారం సాయంత్రం పురుగుమందు తాగి మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి...

చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన బోజెడ్ల ప్రభాకర్ అనే రైతు తన సెల్‌ఫోన్‌లో సోమవారం సాయంత్రం ఓ వీడియో రికార్డు చేశాడు. అందులో ఆయన తన సమస్యను బాధతో వెల్లడించాడు. వీడియోలో ప్రభాకర్ తన చేతిలో పురుగుల మందు బుడ్డిని పట్టుకున్నాడు. పొద్దుటూరులో 276, 277 సర్వే నెంబర్‌లో తనకున్న మూడెకరాల భూమిని కొందరు పొక్లెయిన్లు, ఎక్స్‌కవేటర్, డోజర్లతో నాశనం చేశారని, గ్రామానికి చెందిన కూరపాటి కిషోర్, పెంట్యాల రామారావు, గుర్రం నాగమల్లేశ్వరావు, మొగిలి శ్రీను, ముత్తయ్య కలిసి తన పొలాన్ని నాశనం చేశారని వీడియోలో ఆరోపించాడు. తహసీల్దార్‌కు, ఎస్‌ఐకి చెప్పినా న్యాయం జరగలేదన్నాడు. ఖమ్మం కలెక్టర్‌ను కలుద్దామని వచ్చినా సమయం అయిపోయిందని చెప్పారన్నాడు. తనకు వేరే గత్యంతరం లేక ఈ మందు బుడ్డే శరణ్యంగా భావిస్తున్నానని, తాను ఎవరికీ అన్యాయం చేయలేదన్నాడు. ఎక్కడికి వెళ్లినా తనకు న్యాయం జరగలేదని, ఇక తనకు మరణమే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు. 'నేను రైతుగా బతికా, రైతురాజ్యం రావాలని కాంగ్రెస్‌కు ఓటేశాను.. అందరూ కలిసి నా కుటుంబసభ్యులకు న్యాయం చేయాలి..' అని వీడియోలో వేడుకున్నాడు. ఈ వీడియోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు పంపి న్యాయం చేయాలని కోరాడు.

వీడియో రికార్డు అనంతరం...

రైతు ప్రభాకర్ తన వీడియోను ఖమ్మం నగరంలోని చెరుకూరి గార్డెన్స్ వద్ద రికార్డు చేసి, వాట్సా‌ప్‌లో తన కుటుంబసభ్యులకు పంపాడు. అలాగే ఫోన్‌లో తెలిపాడు. అనంతరం పురుగులమందు తాగాడు. ప్రభాకర్ నుంచి ఫోన్ రాగానే కుటుంబసభ్యులు ఆందోళనతో పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి చూసే సరికి ప్రభాకర్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యులు వచ్చి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది. ఇదిలావుండగా, రైతు ప్రభాకరే స్వయంగా వీడియో రికార్డు చేసి పంపాడా..? మరెవరైనా వీడియో తీసి ఆత్మహత్యకు ప్రేరేపించారా అనే విషయం తేలాల్సి ఉంది. గోడపైన సెల్‌ఫోన్‌ను ఉంచి సెల్ఫీ వీడియో తీసినట్టుగా కూడా అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో పొద్దుటూరు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండడంతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



ప్రభాకర్ మృతదేహం



ఘటనా స్థలం వద్ద రైతు ప్రభాకర్ మృతదేహాన్ని తరలిస్తున్న కుటుంబసభ్యులు



కోచింగ్ దందా

ఖమ్మం నగరంలో 'అకాడమీ'ల విద్యా వ్యాపారం

ఖమ్మంలో అకాడమీల పేరిట అడ్డగోలుగా విద్యా వ్యాపారం సాగుతోంది. అనుమతులు లేకున్నా నీట్, జేఈఈ, ఎప్‌సెట్ కోచింగ్ కోచింగ్ పేరుతో అకాడమీలు నిర్వహిస్తున్నారు. భవనాల్లో దర్జాగా తరగతులు కొనసాగిస్తున్నారు. హాస్టళ్లను సైతం నడుపుతున్నారు. ఫీజుల రూపేణ లక్షలు దండుకుంటున్నారు. ఇందులో చేరిన విద్యార్థులకు ఇతర కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. నగరం నడిబొడ్డున జరుగుతున్న ఈ కోచింగ్ దందా ఇంటర్ విద్యాధికారులకు కనిపించకపోవడం విడ్డూరం.

- నీట్, జేఈఈ, ఎప్‌సెట్ పేరుతో లక్షల్లో వసూళ్లు
- అనుమతులు లేకుండానే ఇంటర్ తరగతులు
- గాలి, వెలుతురు లేని గదుల్లో విద్యార్థుల ఇబ్బందులు
- పీఆర్‌వోలతో జోరుగా ప్రచారం
- షార్ట్‌టర్మ్, లాంగ్‌టర్మ్ బ్యాచ్‌లు
- నామమాత్రంగా ఇతర కాలేజీల్లో అడ్మిషన్లు
- చర్యలు పట్టని ఇంటర్ విద్యాశాఖ అధికారులు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 1: జేఈఈ, నీట్‌లో ర్యాంకు కోసం తపించే తల్లిదండ్రుల ఆశలే పెట్టుబడిగా అకాడమీలు వెలుస్తున్నాయి. ఖమ్మం నగరంలోని పలు అకాడమీలు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ర్యాంకుల సునామీ, అత్యుత్తమ ఫలితాల్లో అగ్రగామి, రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు అంటూ బోల్తా కొట్టిస్తున్నారు. ఇక లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ పేరిట, డే స్కాలర్ పేరిట అనధికారికంగా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా అడ్మిషన్లను దండుకుంటున్నారు.

ఒక్కో అకాడమీలో వందలాది మంది

మెడికల్, ఇంజనీరింగ్ పేరిట నిర్వహిస్తున్న అకాడమీ భవనాల్లో కనీసం తాగునీరు కూడా లేని పరిస్థితి కనిపిస్తుంది. సెక్షన్‌కు 60 మంది విద్యార్థుల చొప్పున చేసి ఒక్కో అకాడమీలో సుమారు 250 నుంచి 300 వరకు విద్యార్థులను చేర్చుకొని కోచింగ్ అందిస్తున్నారనే వాదనలు వినపడుతున్నాయి. కోటా ప్రకారం సీట్ల కేటాయింపు, బిల్డింగ్ పర్మిషన్, లీజ్ అగ్రిమెంట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, పార్కింగ్ స్థలం, ఫర్నిచర్, కంప్యూటర్ గది, సిబ్బంది ఒరిజినల్ సర్టిఫికెట్లు, నాణ్యతమైన బోధనను అందించే అధ్యాపకులు లేకుండానే అకాడమీలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. వీటిపై పరిశీలన జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇటువంటి అకాడమీలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇంటర్ బోర్డు గుర్తింపు లేకుండానే.

కళాశాలలకు గుర్తింపు లేకపోతే విద్యార్థులు నష్టపోతారు. ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు సక్రమంగా అందే అవకాశం ఉండదు. గుర్తింపు లేని కళాశాలలో చేరిన విద్యార్థులకు ఉపకార వేతనాలు రాక, సర్టిఫికెట్లు అందక ఉన్నత విద్యలో చేరేందుకు అడ్డంకులు ఏర్పడతాయి. ఇలా అనేక

(మిగతా 6వ పేజీలో)



ఆఫర్ లెటర్స్ పొందిన అభ్యర్థులతో ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్

నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు

- వనరులను వినియోగించుకోవాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- కొత్తగూడెంలో మెగా జాబ్ మేళా
- 65 కంపెనీలు.. 603 మందికి ఉద్యోగాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 1: నిరుద్యోగులు ఉన్న వనరులను వినియోగించుకోవాలని.. నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో మెగా జాబ్ మేళాను తెలంగాణ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్స్, సికింద్రాబాద్ - భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎస్సెస్సీ నుంచి పైచదువులు చదివిన నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాలో 2,450మంది రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరుకావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు 65 ప్రైవేటు కంపెనీల్లో 603మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆఫర్స్ అందజేసినట్టు తెలిపారు.

928 మందిని తదుపరి ఇంటర్వ్యూకు ఎంపిక చేయగా మొత్తంగా 1,531 మందిని ఈ జాబ్ మేళాలో ఎంపిక చేయటం జరిగిందన్నారు. తొలుత ఈ జాబ్ మేళాను భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి పొందిన యువత సక్రమంగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందాలన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ ఛైర్మన్ కాపు సీతాలక్ష్మి, జిల్లా ఉపాధి కల్పనాధికారి విజేత, జిల్లా యువజన క్రీడల అధికారి కె.సంజీవరావు, కన్సల్టెన్సీ యూత్ సర్వీస్ అంబాసిడర్ మన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పుడమికి చీర కట్టినట్టు..

మిర్చి నారుమళ్లలో విత్తనాలకు రక్షణ కల్పించేందుకు రైతులు చీరల ఐడియాకు తెరతీశారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం లక్ష్మీనగర్ సమీపంలో మిర్చి మొక్కలు పెంచేందుకు ప్రత్యేకంగా రైతులు నారుమళ్లు సిద్ధం చేశారు. రెండురోజులుగా వర్షం కురుస్తుండడంతో సోమవారం నారుమళ్లల్లో మిర్చి విత్తనాలు నాటారు. అయితే మిర్చి విత్తనం మొలకెత్తేందుకు అవసరమైన వెచ్చదనంతోపాటు పురుగులు, పక్షుల నుంచి రక్షణ కోసం నారుమళ్లపై చీరలు కప్పారు. ఇలా కప్పిన వివిధ రంగుల బతుకమ్మ చీరలు... భూమికి రంగేసినట్లు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. చూసినవాళ్లను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.

-తల్లాడ





6

కొత్తగూడెంలో సమావేశంలో మాట్లాడుతున్న సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా

సఫాయి కర్మచారులను ఆదుకోవాలి

- ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు అందించాలి
- సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యుడు పీపీ వావా
- కొత్తగూడెంలో కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవోలతో సమావేశం

పంటలకు ప్రాణం

- వరుస వర్షాలతో అన్నదాతల్లో ఆనందం
- ఊపందుకున్న వ్యవసాయం

ఖమ్మం, జూలై 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరుస వర్షాలు వానాకాలం సాగు రైతన్నకు మేలు చేకూరుస్తున్నాయి. వేసిన విత్తనాలు మొలకెత్తుతాయా..? లేక మొలకెత్తిన మొక్కలు నీరులేక ఎండిపోతాయా...? అనే ఆందోళనలో ఉన్న రైతులకు గత రెండురోజులుగా కురిసిన వర్షాలు ఊరట కలిగిస్తున్నాయి. దీంతో వానాకాలం సాగు జోరందుకుంది. జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 124.6 మి.మీ.కాగా 198.8 మి.మీ.వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 21మండలాల్లో ఆశాజనకంగానే వర్షాలు కురిశాయి. దీంతో వేసిన పంటలకు వర్షం ప్రాణం పోసినట్టయింది.

జిల్లాలో వానాకాలంలో 5,96,662 ఎకరాలు సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 2,10,317 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో ప్రధానంగా వరి నర్సరీలు 32,340 ఎకరాలు, నేరుగా వరి వెదజల్లడం 15,952 ఎకరాలు, నేరుగా వరినాట్లు వేసినవి 2,260 ఎకరాల్లో వేశారు. పత్తి 2,18,034 ఎకరాలకుగాను 1,53,200 ఎకరాలలో వేశారు. మొక్కజొన్న 3,374 ఎకరాలకుగాను 819 ఎకరాలు, చెరకు 1,537 ఎకరాలకుగాను 14ఎకరాలు, వేరుశనగ 270 ఎకరాలకుగాను 26ఎకరాలు, మినుము 436 ఎకరాలకుగాను 31ఎకరాల్లో వేశారు. పెసర 15,357 ఎకరాలకు గాను 9,895 ఎకరాల్లో వేశారు. కంది 1,005 ఎకరాలకు గాను 20 ఎకరాలు, పిల్లిపెసర 833ఎకరాలలో వేశారు. మొత్తంగా ఇప్పటి వరకు 2,10,317 ఎకరాల్లో పంటలు వేశారు. అయితే ప్రస్తుతం కురిసిన వర్షాలు ఈ పంటలకు ఉపయోగం కాగా, చెరువులు, వాగులు, ప్రాజెక్టులు నీరు లేక వెలవెలబోతున్నాయి.

గౌతమ్‌కు ఘనంగా వీడ్కోలు



ఖమ్మంకలెక్టరేట్, జూలై1: కలెక్టర్‌గా వీపీ గౌతమ్ విధినిర్వహణలో... అంకితభావంతో పనిచేసి ఉద్యోగులకు.. అధికారులకు మార్గదర్శకంగా నిలిచారని జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రాత్రి జడ్పీ సమావేశ మందిరంలో బదిలీపై వెళ్లిన వీపీ గౌతమ్‌కు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. గౌతమ్ అభివృద్ధిలో జిల్లాను అగ్రపథాన నిలిపారన్నారు. అనంతరం కలెక్టర్ గౌతమ్, ఆయన సతీమణి గౌతమిని గజమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి విక్రమ్ రాథోడ్, జడ్పీ సీఈవో ఎస్ వినోద్, డీఆర్డీవో సన్యాసయ్య, కొండపల్లి శ్రీరాం, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్



ఖమ్మం కార్పొరేషన్, జూలై 1: వర్క్ ఇన్‌స్పెక్టర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం నగరపాలకసంస్థ ఇంజనీరింగ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గుడిబండ్ల పవన్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ఆదివారం తెలంగాణా రాష్ట్రంలో నగరపాలకసంస్థలు, పురపాలికాలు, నగర పంచాయతీల్లో పని చేస్తున్న వివిధ జిల్లాలకు చెందిన వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి, తొలి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో ఖమ్మం నగరపాలకసంస్థ నుంచి ఇన్‌స్పెక్టర్ గుడిబండ్ల పవన్‌కుమార్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. పవన్‌కుమార్‌తో పాటు ఖమ్మం నగరపాలకసంస్థలో ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న గడ్డమణుగు శ్రీనివాసరావు, వేముల శ్రీకాంత్‌ను ఉమ్మడి ఖమ్మంజిల్లా ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

జర్నలిస్టుల బ్రోచర్‌ను ఆవిష్కరించిన పీవో



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, జూలై 1: భద్రాచలం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా బ్రోచర్‌ను ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆవిష్కరించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో భద్రాచలం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులతో కలిసి ఆయన జర్నలిస్టుల ఫోన్ నెంబర్ల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శ్రీపాద శ్రీధర్, కోశాధికారి జి.శ్రీనివాస్, కమిటీ సభ్యులు ప్రసాద్ యాదవ్, శ్రీనివాస్, సంతోష్‌కుమార్, లక్ష్మణ్, శివ, ప్రేమ్‌కుమార్, జయరాం, బాలకిరణ్ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకారం



భద్రాచలం, జూలై 1: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

కమ్మేస్తున్న కాలుష్యం



బీటీపీఎస్ బాయిలర్ల నుంచి వెలువడుతున్న కాలుష్యం



పంట పొలాల కాలువల్లో కలుస్తున్న బూడిద నీరు

- ప్రభావిత గ్రామాల ప్రజలకు శాపంగా బీటీపీఎస్ బూడిద
- ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- పంట పొలాలు నాశనం
- కాగితాల్లో కాలుష్య నియంత్రణ చర్యలు
- పక్కదారి పడుతున్న సీఎస్ఆర్ నిధులు

మణుగూరు రూరల్, జూలై1: రెండు పంటలు పండే సారవంతమైన పంట పొలాలను ప్రాజెక్టు నిర్మాణానికి దారాధత్తం చేశారు ఇక్కడి ప్రజలు. పవర్ ప్రాజెక్టు నిర్మిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగు పడి బతుకులు బాగు పడతాయని ఎన్నో కలలు కన్నారు. కానీ అదే ప్రాజెక్టు తమ బతుకుల్లో బూడిద నింపుతుందని ఊహించలేక పోయారు.

మణుగూరు మండలంలో నిర్మించిన భద్రాద్రి పవర్ స్టేషన్‌తో ప్రభావిత గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. తమ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య ప్రభావం ఇదే విధంగా కొనసాగితే ప్రభావిత గ్రామాలు కనుమరుగైయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. బీటీపీఎస్ నుంచి వెలువడే వ్యర్థాల వల్ల ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు.

వెలువడుతున్న రసాయన కాలుష్యం

బీటీపీఎస్ నుంచి వెలువడే కాలుష్యంతో సల్ఫర్, కార్బన్ డైయాక్సైడ్‌తో పాటు పాటు లోహాలు వెలువడుతుండటంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దమ్మక్క పేట గ్రామాన్ని ఆనుకుని నిర్మించిన యాష్ ప్లాంట్ నుంచి బూడిద ఎగిసి పడుతోంది. ఎండాకాలంలో అయితే గాలులకు బూడిద ఎగిరి పడి దమ్మక్కపేట, సాంబాయిగూడెం, సీతారామపురం తదితర పరిసర గ్రామాలను కమ్మేస్తుంది. దమ్మక్క పేటలో నిర్మించిన యాష్ ప్లాంట్ ద్వారా బూడిద నీటిని కాలువల ద్వారా గోదావరిలోకి తరలిస్తుండటంతో పొంగి పంటపొలాలను ముంచెత్తుతోంది దీంతో పంటలు పండక వేసిన పంటలు నాశనం కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

పక్కదారి పడుతున్న సీఎస్ఆర్ నిధులు

బీటీపీఎస్ ప్రభావిత గ్రామాలను సీఎస్ఆర్ నిధులతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సి ఉండగా ఆయా నిధులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభావిత గ్రామాలను



సీఈకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

దత్తత తీసుకుని సీసీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు విద్యుత్, తాగునీరు పాఠశాలలు ఆసుపత్రుల నిర్మాణాలు చేసి అభివృద్ధి పరుస్తామని అధికారులు ఆనాడు హామీ ఇచ్చారు. కానీ సీఎస్ఆర్ కింద మంజూరు అవుతున్న నిధులు ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ గ్రాంట్ కింద పెద్దఎత్తున నిధులు మంజూరుకాగా గత ప్రభుత్వ హాయం లో ఆ పార్టీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి ములుగు జిల్లాకు తరలించుకుపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎఫ్‌జీడీ ప్లాంట్ నిధులతో కాలుష్య నివారణ చర్యలు -బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

రూ.400 కోట్లతో ఆధునిక పరిజ్ఞానంతో ఫ్లూ గ్యాస్ డివైస్(ఎఫ్‌జీడీ)ప్లాంట్ చేపడుతున్నామని బీటీపీఎస్ సీఈ బిచ్చన్న ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి అయితే ప్రభావిత గ్రామాలకు కాలుష్య ముప్పు ఉండదని అన్నారు.

పరితోష్ పంకజ్‌కు ఉద్యోగోన్నతి

- జిల్లా ఓఎస్డీగా నియామకం
- భద్రాద్రి ఏఎస్పీగా అంకిత్‌కుమార్ శంఖ్వార్



పరితోష్ పంకజ్



అంకిత్‌కుమార్ శంఖ్వార్

భద్రాచలం, జూలై 1: భద్రాచలం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు(ఏఎస్పీ)గా బాధ్యతలు నిర్వహిస్తున్న పరితోష్ పంకజ్‌కు కొత్తగూడెం అడిషనల్ ఎస్పీ(ఓఎస్డీ)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులకు బదిలీలు అయ్యాయి. అందులో పరితోష్ పంకజ్‌ను కొత్తగూడెం ఓఎస్డీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బిహార్ రాష్ట్రంలోని బోజ్‌పూరి జిల్లా ఆరా పట్టణానికి చెందిన పరితోష్ పంకజ్ సివిల్ సర్వీసెస్‌లో 142వ ర్యాంకు సాధించగా 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. తొలుత వరంగల్ జిల్లా రఘునాధపల్లి ఎస్‌హెచ్‌వోగా శిక్షణ పొందారు. అనంతరం నేషనల్ పోలీసు అకాడమీతో పాటు గ్రేహౌండ్స్‌లో మూడు నెలల పాటు బాధ్యతలు నిర్వహించి భద్రాచలం ఏఎస్పీగా 2023 జనవరి 30న బాధ్యతలు చేపట్టారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసే అధికారిగా ఆయనకు పేరుంది.

భద్రాచలం నూతన ఏఎస్పీగా అంకిత్‌కుమార్ శంఖ్వార్‌ను నియమించారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం జనగామ ఏసీపీగా ఏప్రిల్ మూడు నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యూపీలోని కాన్పూర్‌కు చెందిన ఆయన ఢిల్లీలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ పూర్తి చేశారు. ఎస్‌హెచ్‌వోగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తి పోలీసు స్టేషన్‌లో ఆయన బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఏఎస్పీ హోదాలో గ్రేహౌండ్స్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అంకిత్‌కుమార్ శంఖ్వార్‌ను జనగామ ఏసీపీగా నియమించారు. రెండు నెలల వ్యవధిలోనే ఆయనను భద్రాచలం ఏఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం భద్రాచలం ఏఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తూ ఓఎస్డీగా ఉద్యోగోన్నతి పొందిన పరితోష్ పంకజ్ అంకిత్‌కుమార్ శంఖ్వార్ బ్యాచ్‌మెట్ కావడం విశేషం. విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరిస్తారని, ప్రజలతో ఎక్కువగా సత్సంబంధాలు కలిగి ఉంటారని అంకిత్‌కు పేరుంది. ఈ వారంలో ఆయన భద్రాచలం ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

న్యూడెమోక్రసీ నేత విశ్వనాథం హఠాన్మరణం



ఇల్లెందు టౌన్, జూలై 1: న్యూడెమోక్రసీ భద్రాద్రి జిల్లా కమిటీ సభ్యుడు ఇఫ్టూ రాష్ట్రకమిటీ నాయకుడు ఎల్. విశ్వనాథం (62) సోమవారం గుండెపోటుతో హఠార్మరణం చెందారు. ఇల్లెందు మండలం రొంపేడు గ్రామానికి చెందిన విశ్వనాథం నాలుగు దశాబ్దాలుగా న్యూడెమోక్రసీ పార్టీలో వివిధ బాధ్యతల్లో పని చేస్తున్నారు. ఇల్లెందు ప్రాంతంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ అర్గనైజరుగా కార్మికసంఘం నాయకుడిగా పని చేశారు. కూతురు ఇంటికి సిద్దిపేటకు వెళ్లిన విశ్వనాథం అక్కడే తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. కాగా విశ్వనాథం మృతి పట్ల ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ప్రజాపంథా రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, యాకూబ్‌షావళి, న్యూడెమోక్రసీ నాయకులు సీతారామయ్య, ఎండి. రాసుద్దీన్, యదళ్లపల్లి సత్యం, మోకాళ్ల రమేష్ తదితరులు సంతాపం వ్యక్తంచేశారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గురుకుల బదిలీలు, పదోన్నతులు కల్పించాలి

దమ్మపేట, జూలై 1: గురుకుల ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని తెలంగాణా గిరిజన సంక్షేమ గురుకుల ఉద్యోగుల(టీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శ్యామ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. దమ్మపేటలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు చేపట్టిన ప్రభుత్వం అదే క్రమంలో గురుకుల ఉద్యోగులకు కూడా వెంటనే పదోన్నతలు, బదిలీలు చేపట్టాలన్నారు. ఇటీవలే ప్రభుత్వం 317 జీవోకు అణుగుణంగా సీనియారిటి జాబితా తయారు చేశారని, దాని ప్రకారం బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. కొత్తగా గురుకులలో ఉద్యోగం పొందిన వారికీ న్యాయం జరుగుతుందని పాత ఉద్యోగులకు న్యాయం జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు.

బాధ్యతగా పని చేయండి..

- ప్రజల కోసమే ఉన్నాం..వారి కోసమే పనిచేయాలి..
- అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం



చెరువుల కబ్జాపై మంత్రి తుమ్మలకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

రఘునాథపాలెం, జూలై 1: 'ఉపాధి హామీలో రూ.6కోట్ల పనులు చేశారు. కానీ ఇప్పుడు 6 పనులు కూడా కనిపించటం లేదు. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి రహదారులు నిర్మిస్తుంటే ప్రైవేట్ కంపెనీలు రహదారి మధ్యలో పైపులు వేస్తూ ధ్వంసం చేస్తున్నారు. మీరు ఎందుకు స్పందించటం లేదు. చెరువులు కబ్జాలు జరుగుతున్నట్లు రైతులు ఫిర్యాదులు చేసే వరకు వచ్చింది.. మీరేం చేస్తున్నారు' అంటూ ఉపాధి, ఇరిగేషన్, రహదారుల శాఖల అధికారులపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వశాఖలపై ఫిర్యాదు చేయటంతో మంత్రి తుమ్మల తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇచ్చినా ఇంతవరకు బోర్లు వేయలేదని, రెవెన్యూ, అటవీ, విద్యుత్‌శాఖలు సహకరించడం లేదని మాజీ సర్పంచ్ ఫిర్యాదు చేశాడని తెలిపారు. చెరువులు కబ్జాకు గురవుతున్నాయని రైతులు ఫిర్యాదు చేస్తున్నారని, చెరువులకు హద్దులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఎస్సారెస్పీ కాల్వ ద్వారా ఎన్ని చెరువులకు సాగునీరు అందుతుందని అధికారులను మంత్రి ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంలో చెరువుల్లో పూడిక తీసి పక్కనే మట్టి వేయటంతో వర్షాలవల్ల ఆ పనులు కొట్టుకుపోయాయన్నారు. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తానని మంత్రి తుమ్మల హెచ్చరించారు. పదేళ్లుగా హరితహారంలో నాటిన మొక్కల్లో ఇప్పటివరకు ఎన్ని బతికించారని ప్రశ్నించారు. ప్రభుత్వశాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇష్టం వచ్చినట్లు మొక్కలు నరికేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఊరికి బయట ప్రాంతాల్లో పళ్ల మొక్కలు నాటితే కోతులకు ఆహారం లభించి అవి గ్రామాల్లోకి రావని మంత్రి సూచించారు. రానున్న కాలంలో మొక్కలు నాటే కార్యక్రమం పక్కాగా చేపట్టాలని సూచించారు. కిడ్నీ జబ్బు బాధితుల మరణాలకు గల కారణాలపై నివేదికలు అందించాలని ఆదేశించారు. కాగా పంచాయతీల ప్రత్యేక అధికారులు గ్రామాలకు రావటం లేదని, వీధి దీపాలు ఏర్పాటు చేయటం లేదని, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండటం లేదని, కనీసం తాగు నీటి సమస్య పట్టించుకోవటం లేదని పలువురు నాయకులు మంత్రి తుమ్మలకు ఫిర్యాదు చేశారు.

ముఖ్యమైన ఈ సమావేశానికి ఎంపీడీవో సైతం గైరాజరయ్యారు. సమావేశానికి హాజరుకాని అధికారుల వివరాలతో తనకు రిపోర్టు ఇవ్వాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు ప్రియాంక, ఎంపీపీ భూక్య గౌరి, తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంఈవో శ్రీనివాసరావు, ఏడీఈలు సంజయ్‌కుమార్, ఎఫ్ఆర్వో రాధిక, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

కోచింగ్ దందా!

(5వ పేజీ తరువాయి)

సమస్యలు వస్తాయి. అత్యధిక మార్కులు సొంతం అంటూ ఉదర గొగుతున్నా అకాడమీల మాయలో పడుతున్న తల్లిదండ్రుల నుంచి లక్షలు దండుకుంటున్నాయి.

గాలి వెలుతురు రాని గదుల్లో...

జూనియర్ కళాశాల అని పేరు పెట్టుకుంటే కళాశాల అనుమతి కోసం భారీగా ఖర్చవుతుంది. ఈ ప్రభుత్వ ఫీజులను తప్పించుకోవడానికి ఎక్కడా బోర్డు లేకుండా అపార్ట్మెంట్లలో అకాడమీ పేరుతో తరగతులు నడిపి కోచింగ్ పేరుతో కోట్లు సంపాదిస్తున్నారు. కనీసం సరైన సౌకర్యాలు కల్పించకుండా వందలాది మందిని పెట్టి వెలుతురు లేని, గదులు ఇరుకుగా ఉండే వాతావరణంలో తరగతులు నిర్వహిస్తున్నారు. మార్కెటింగ్ బృందాలు, పీఆర్‌వోలతో స్కాలర్‌షిప్ టెస్టులు, రాయితీలు అంటూ ప్రచారం ఉదరగొడుతున్నారు. అక్కడ సరిపడా టాయిలెట్స్ వసతి కూడా ఉండదు. అయినా ఇంటర్ అధికారులు చర్యలకు వెనకాడుతున్నారు.

దివాళా పిటీషన్ దాఖలు

ఖమ్మంలీగల్ జూలై1: భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన గంట గోవర్ధన్ మొత్తం 18 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ మొత్తం రూ.52లక్షలకుపైగా దివాళా పిటీషన్ దాఖలు చేశాడు. దివాళాదారుడు శ్రీ దుర్గ వీల్ కేర్ అనే పేరుతో చక్రాలు, కార్‌కు సంబంధించిన డికార్స్ వ్యాపారం చేసేవాడు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకున్నాడు. నష్టం రావటంతో రుణదాతల నుంచి ఒత్తిడి రావటంతో దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

మధిరకు ఇండస్ట్రియల్ పార్క్, ఐటీహబ్

- రెండింటికీ కలిపి 86 ఎకరాలు కేటాయింపు
- ఇండస్ట్రియల్ పార్క్‌లో స్థానికులకు ప్రాధాన్యత
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఇండస్ట్రియల్ పార్కు మ్యాప్ చూపుతున్న భట్టి

మధిరటౌన్, జూలై 1: మధిర నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ పార్క్, ఐటీహబ్ మంజూరు చేసినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం మధిర మండలంలోని యండపల్లి రెవెన్యూలో 84 ఎకరాలు, ఐటీహబ్‌కు ఇరిగేషన్ శాఖకు చెందిన రెండెకరాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ యండపల్లి రెవెన్యూలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు 84.20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడమే కాకుండా ఆ భూమిని టీఎస్ఐడీసీకి బదలాయించినట్లు తెలిపారు. ఈ ఇండస్ట్రియల్ పార్క్‌లో ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

ఈ భూమిలో రోడ్లు, విద్యుత్, నీళ్లు అన్ని రకాల మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని తెలిపారు. స్థానిక వ్యాపారులు, పారిశ్రామకవేత్తలకు ఈ పార్క్‌లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మధిర ప్రాంతం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావటం వల్ల ఇక్కడ ఉత్పత్తి అయ్యే పంటలను ప్రాసెస్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేలా ప్రోత్సహిస్తే, ఇక్కడి యువతకు ఉపాధి లభించడమే కాకుండా వారు పారిశ్రామికంగా ఎదుగుతారన్నారు. మధిరతో పాటు చుట్టుపక్కల ప్రాంతంలో సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులు అనేకమంది ఉన్నారని, యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మధిరకు ఐటీహబ్ మంజూరు చేసినట్లు తెలిపారు. దీనికోసం మధిర పట్టణం నడిబొడ్డున ఇరిగేషన్ శాఖకు చెందిన సుమారు రెండు ఎకరాల స్థలాన్ని గుర్తించామని, దీనికి సంబంధించిన క్లియరెన్స్‌లు రాగానే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే బోనకల్‌లో ఇందిరా డైరీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మధిర పట్టణంలో నివసించే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా రూ.128 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేశామని, మధిర ప్రజలు ఊహించినదానికంటే మెరుగ్గా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని భట్టి తెలిపారు.

సఫాయి కర్మచారుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు అందించాలి
- సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా

కొత్తగూడెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సఫాయి కర్మచారుల సమస్యలను పరిష్కరించాలని సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ.వావా కోరారు. సోమవారం భద్రాద్రి జిల్లాకు విచ్చేసిన డాక్టర్ వావాను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వావా మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉండాలని కష్టపడే సఫాయి కర్మచారీలకు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థికసాయం, బ్యాంకు రుణాలు అందించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య శిబిరాన్ని నిర్వహించి వారికి వైద్య సేవలు అందించాలన్నారు. వారి సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రెయిన్ శుభ్రపరిచే కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జీతం పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికి కనీస వేతనాలు దక్కేలా చట్టాలను కచ్చితంగా అమలుచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ సఫాయ కర్మచారుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంవత్సరంలో నాలుగు సార్లు సఫాయి కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సఫాయి కార్మికుల సంక్షేమానికి అన్ని మండలాల్లో సబ్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు భూపతి అప్పారావు మాట్లాడుతూ సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించి సంక్షేమ పథకాలు ఈఎస్ఐ, పీఎఫ్ అమలయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్డీవో విద్యాచందన, డీఎస్పీ రెహమాన్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, జిల్లా సంక్షేమ అధికారి అనసూయ, జిల్లా లేబర్ ఆఫీసర్, జిల్లా వైద్యాధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తప్పిదంతో.. పునాదిలో నిలిచిన పనులు

- హెడ్ ఆఫ్ ఎకౌంట్ కేటాయింపులో అధికారుల తప్పిదం
- బిల్లులు రాక నిలిపివేసిన కాంట్రాక్టర్



పునాది స్థాయిలో నిలిచిన భవనం

కల్లూరు, జూలై1: నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయ భవనాలు పునాదిలోనే నిలిచి పోయాయి. నిర్మాణానికి సంబంధించి అధికారుల సిద్ధం చేసిన సాంకేతిక అంచనాల లోపం కారణంగా భవనం పనులు నిలిచి పోయాయి. గత ఏడాది ఏప్రిల్ నెల 24న రూ.1.92 కోట్ల అంచనాతో ఈ భవనాన్ని అప్పటి ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు శంఖుస్థాపన చేశారు. అప్పటిలో సదరు భవన నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాదిలోగా ఈ భవనం పనులు పూర్తి చేసేందుకు కాలపరిమితి విధించారు. ఆ స్థాయిలో చేసిన పనులకు గాను రూ. 30 లక్షల వరకు బిల్లులు అందాల్సి ఉంది. అందుకు భిన్నంగా సకాలంలో చేసిన పనులకు పై విధంగా బిల్లులు అందకపోవటంతో గుత్తేదారు గతఏడాది జూలై నుంచి పనులను ఆపి వేశాడు.

హెడ్ ఆఫ్ ఎకౌంట్ సక్రమంగా లేక పోవటమే....

కల్లూరు జలవనరులశాఖ పర్యవేక్ష ఇంజనీర్ కార్యాలయ భవనం నిర్మాణంలో స్థానికంగా సర్కిల్ అధికారులు సాంకేతికంగా రూపొందించిన అంచనాల్లో పేఅండ్ ఎకౌంట్స్ ఆఫీస్ ఖాతా నెంబర్ సక్రమంగా నమోదు చేయలేదు. ఈ కారణంగా బిల్లులు అందలేదని తెలిసింది.పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కాలపరిమితి పూర్తియై మూడు నెలలు కావస్తున్నా సంబంధితశాఖ అధికారులు బిల్లుల మంజూరుకు హెడ్ఆఫ్ అకౌంట్ ఖాతా నెంబరును ఉన్నత అధికారుకారులను సంప్రదించటం లేదు.

రేకుల షెడ్డులో శాఖ సర్కిల్ కార్యాలయం

కల్లూరు ప్రాంతానికి రెండుసంవత్సరాల క్రితం ప్రభుత్వం జలవనరులశాఖ కార్యాలయాన్ని మంజూరు చేసింది. మధిర కల్లూరు సత్తుపల్లి ప్రాంతాలకు కేంద్ర బిందువుగా ఈ కార్యాలయం పరిపాలన సౌలభ్యం కొరకు ఏర్పాటు చేశారు. దీని పరిధిలో కల్లూరు, మధిర, సత్తుపల్లి డివిజన్లగా విస్తరించగా పది మండలాల పరిధిలో గల సాగునీటి ప్రాజెక్టుల చెరువులు, కుంటల పర్యవేక్షణ సాగుతుంది. దీంతో ఇక్కడ ఎస్ఈ క్యాడర్‌గల ఇంజనీర్‌తో పాటుగా డిప్యూటీ సూపరింటెండ్, ఎగ్యూక్యూటీవ్, డిప్యూటీ ఇంజనీర్లు ఇతర స్థాయిలో అధికారులు, మినిస్టీరియల్ స్టాఫ్‌ను కేటాయించగా వారందరు ప్రస్తుతం పాత ఎన్నెస్పీ రేకుల షెడ్డులో విధులు నిర్వర్తిస్తున్నారు.

నేడు స్పోర్ట్స్ స్కూళ్లకు జిల్లా స్థాయి ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 1: స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాలకు మంగళవారం మరో సారి జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఈనెల 28, 29 తేదీల్లో నగరంలోని సర్ధార్ పటేల్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించినా వర్షాల కారణంగా ఆశించిర మేర విద్యార్థులు హాజరు కాలేదని తెలిపారు. జిల్లాస్థాయి ఎంపికలలో ప్రతిభ చూపిన వారిని జూలై 8 నుంచి 12 వరకు హైదరాబాద్‌లోని హకీంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపుతామని ఆయన తెలిపారు. మండల స్థాయిలో పాల్గొనని వారు నేరుగా జిల్లాస్థాయి ఎంపికలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రేపు, ఎల్లుండి స్పోర్ట్స్ అకాడమీలలో ఖాళీలకు ఎంపికలు

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే పలు స్పోర్ట్స్ అకాడమీల్లో మిగిలిన ఖాళీలకు భర్తీ చేసేందుకు ఈనెల 3,4 తేదీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హన్మకొండ రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్, ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీలో (8 ఖాళీలు) భర్తీకి హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో, ఓయూ క్యాంపస్ లోని సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీ ఎంపికలు తార్నాకలోని ఓయూ క్యాంపస్‌లో, సరూర్‌నగర్, రాజన్న సిరిసిల్లలోని వాలీబాల్ అకాడమీలలో ఖాళీల ఎంపికలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో, వనపర్తిలోని హాకీ అకాడమీలో ఖాళీల ఎంపికలు వనపర్తిలోని అకాడమీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర సమాచారానికి సర్ధార్ పటేల్ స్టేడియంలో నేరుగా, ఫోన్ ద్వారా9490021220 నెంబరును సంప్రదించాలని కోరారు.

73 అవుట్‌సోర్సింగ్ పోస్టులకు తాత్కాలిక జాబితా విడుదల

» డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్

చుంచుపల్లి, జూలై1: భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ 73 అవుట్ సోర్సింగ్ పోస్టులకు అభ్యంతరాలతో కూడిన తాత్కాలిక జాబితా విడుదలను అధికారిక వెబ్‌సైట్‌లో డీఎంహెచ్‌వో కార్యాలయ నోటీస్ బోర్డులో ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకం జిల్లా సెలక్షన్ కమిటీ ఛైర్మన్ కలెక్టర్ ఆధ్వర్యంలో మెరిట్‌తో పాటు రోస్టర్ పద్ధతిన జరుగుతుందన్నారు. అభ్యర్థి అర్హత పరీక్షలో వచ్చిన మార్కులు, వయస్సు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సెలక్షన్ పకడ్బందీగా జరుగుతుందన్నారు. ఈ ఉద్యోగాల కోసం అభ్యర్థులు ఎటువంటి దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రలోభాలకు గురికావద్దని, ఎవరైన పోస్టులు ఇప్పిస్తామని డబ్బులు వసూలుకి ప్రయత్నిస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.



పదోన్నతి పొందిన సూపర్‌వైజర్స్‌కు మూమెంట్ ఆర్డర్లను అందజేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

నిర్మించారు...వదిలేశారు

ఆ ప్రాజెక్టు ప్రతీ రోజు సుమారు 20 వేల మందికి తాలిపేరు నీటిని అందించింది. సుమారు 15 యేండ్ల పాటు చర్ల వాసులు దాహార్తిని తీర్చింది. కానీ నేడు అదే ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకుంది. 2019 సంవత్సరం నుంచి మిషన్ భగీరథ రావడంతో అధికారులు ప్రాజెక్టును పట్టించుకోవడం మరిచిపోయారు. ప్రాజెక్టుకు సంబంధించిన భారీ మోటార్లు, పైపులైన్లు, ఫిల్టర్‌బెడ్‌లు నేటికీ అలానే ఉన్నాయి. ప్రాజెక్టు కొద్దిగా మరమ్మతులు చేస్తే మిషన్ భగీరథకు ధీటుగా తాగు నీరు అందిస్తుంది. లేకపోతే రూ.కోటితో కట్టిన ప్రాజెక్టు కనుమరుగు కానుంది.

» నిరుపయోగంగా ఫ్లోరైడ్ రహిత ప్రాజెక్టు » 2004లో తాలిపేరు ప్రాజెక్టు వద్ద నిర్మాణం

» భగీరథతో ప్రాజెక్టును పట్టించుకోని అధికారులు » ఉపయోగంలోకి తేవాలని వినతి

చర్ల, జూలై 1: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండంలం దోసిళ్లపల్లి గ్రామ సమీపంలోని తాలిపేరు ప్రాజెక్టు వద్ద 2004లో యేండ్ల క్రితం ఫ్లోరైడ్ రహిత తాగునీటి ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మించింది. మండల వాసులకు స్వచ్ఛమైన తాగేనీరు అందించాలనేది ప్రభుత్వం యొక్క లక్ష్యం. ఇందుకోసం ప్రత్యేక నిధుల కింద సుమారు కోటి రూపాయలను మంజూరు చేశారు. మండలంలోని సుమారు 50 గ్రామాలకు పైపులైన్లు కూడా వేశారు. 2004 నుంచి 2019 వరకు ప్రాజెక్టు స్వచ్ఛమైన తాగునీరు అందించింది. గోదావరి నీటి కంటే తాలిపేరు నీటిని తాగేందుకు స్థానికులు ఇష్ట పడుతుంటారు. ప్రజలకు స్వచ్ఛమైన. నాణ్యమైన తాగునీరు అందించేందుకు అప్పటి అధికారులు తాలిపేరు ప్రాజెక్టు నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడి, ఫిల్టర్ బెడ్‌లో మూడు దశలుగా (ఇసుక రేణువుల్లో) నీటిని శుద్ధి చేసి మండల వాసులకు సరఫరా చేశారు. ఈ ప్రాజెక్టు నిర్వహణకు పెద్దగా ఖర్చుకూడా అయ్యేది కాదు.

ప్రతీ రోజు 20 వేల మందికి సరఫరా

ఫ్లోరైడ్ రహిత ప్రాజెక్టు నుంచి ప్రతీ రోజు 20వేల మందికి తాగునీటిని అందించేవారు. చర్ల, పెద్దమడిసిలేరు, చిన్న మడిసిలేరు, బెస్తకొత్తూరు, తేగడ, కలివేరు, కత్తిగూడెం, కొయ్యూరు గ్రామాల వారు ఈ నీటిని తాగేవారు. ఇతర గ్రామాల వారు కూడా తాలిపేరు లైన్లు వేయాలని కోరేవారు. మరి కొంత మంది ప్రాజెక్టు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునేవారు.

ఫ్లోరైడ్ రహిత ప్రాజెక్టును పనిచేసేలా చేస్తే మండల వాసులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికే ఈప్రాజెక్టు కాస్త దెబ్బతిన్నా, మరమ్మతులు చేస్తే సరి పోతుంది. పైపులైన్లు, మోటార్లు, బెడ్‌లు, ఇతర పరికరాలు అలానే ఉన్నాయి. కాగా 2019లో మిషన్ భగీరథ రావడంతో ఈ పథకాన్ని అధికారులు పట్టించుకోవడం మానేశారు. అధికారులు ముందు చూపుగా ఈ ప్రాజెక్టుని రన్నింగ్‌లో ఉంచితే మిషన్ భగీరథ పని చేయనప్పుడు ఈ ప్రాజెక్టును వినియోగించుకోవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తాగునీటి సమస్యను చాలా వరకు తగ్గించవచ్చని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ విధంగా ఆలోచన చేస్తే రూ.కోటితో కట్టిన ప్రాజెక్టు ఉపయోగంలోకి రాగా, మండల వాసులకు పూర్తిగా తాగునీటి సమస్య తీరనుంది.



దోసిళ్లపల్లిలో నిరుపయోగంగా ఉన్న ఫ్లోరైడ్ రహిత ప్రాజెక్టు కార్యాలయం

ఇంటింటికీ డయేరియా మాత్రల పంపిణీ

● డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 1: జిల్లాలో సోమవారం నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నీళ్ల విరోచనాల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఇంటింటినీ సందర్శించి (0-5) సంవత్సరం లోపు పిల్లలు ఎంతమంది ఉన్నారు, వారికి నీళ్ల విరోచనాల సమస్య ఉంటే వారికి ఓఆర్ఎస్ పాకెట్, జింక్ మాత్రలు (వయస్సు వారి డోసు) ఇచ్చి తగిన చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక వేళ ఏమైనా సమస్యలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, పల్లె దవాఖానకు పంపించి అక్కడ చికిత్సలు అందే విధంగా ఆశాలు, పారామెడికల్ సిబ్బంది పర్యవేక్షిస్తారని తెలిపారు. అలాగే నీళ్ల విరేచనాలు ఎలా సంభవిస్తాయి, రాకుండా చేపట్టవలసిన చర్యలు, చికిత్సల గురించి ప్రజలలో అవగాహన కల్పిస్తారని తెలిపారు. తాగునీటిని వేడి చేసి చల్లార్చిన తరువాత తాగాలని, పాత్రపై మూతలు ఉంచి, వేడి వేడి పదార్థాలను మాత్రమే తీసుకోవాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి డయేరియా లాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తపడాలని కోరారు. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది ఆశాలు, ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో అమలు చేసి పిల్లల్లో అతిసారం రాకుండా వ్యాధి నియంత్రణ కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు.

పద్మశ్రీ సకిని కుటుంబానికి ఆర్థిక సాయం

● రూ.2లక్షలు అందించిన ఎమ్మెల్యే పాయం



నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, జూలై 1: మణుగూరు మండలంలోని కూనవరం గ్రామానికి చెందిన ఆదివాసీ డోలు వాయిద్య కళాకారుడు పద్మశ్రీ సకిని రామచంద్రయ్య అంత్యక్రియల నిమిత్తం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంగా రూ.2లక్షల నగదును సోమవారం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సకిని కుటుంబానికి అండగా నిలుస్తామని ఇచ్చిన హామీలో భాగంగా దశదిన కర్మల ఖర్చుల కోసమని ఈ నగదును అందించినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పద్మశ్రీ సకిని కుటుంబానికి కొత్తగూడెంలో ఇంటి స్థలాన్ని ఆదివారం అందజేసిన విషయం తెలిసిందేనన్నారు. ఇంటి నిర్మాణ నిమిత్తం గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామినిచ్చి ఇస్తామని మరిచిపోయిన రూ.కోటి నగదు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి మంత్రులతో పాటు తాను తీసుకువెళ్తానన్నారు. అదే విధంగా ఇటీవల అనారోగ్యానికి గురైన కూనవరం గ్రామ ఎంపీటీసీ సభ్యుడు గుడిపూడి కోటేశ్వరరావు తండ్రి రామయ్య ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కేటీపీఎస్ స్క్రాప్ తరలింపును ఆపండి

» కేటీపీఎస్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

» ఎమ్మెల్యే కూనంనేనితో కలిసి కేటీపీఎస్ పాతప్లాంట్ సందర్శన



టెండర్ షెడ్యూల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేజ్ వి పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, జూలై 1 : కేటీపీఎస్ స్క్రాప్ తరలింపు ప్రక్రియన తక్షణమే నిలిపివేయాలని, తన నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు స్క్రాప్ సేకరణ పనులను సైతం నిలిపివేయాలని కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ కేటీపీఎస్ అధికారులను ఆదేశించారు. కేటీపీఎస్ పాత ప్లాంట్ కూల్చివేత, స్క్రాప్ తరలింపులో అక్రమాలు జరిగాయని, వాస్తవాలను బహిర్గతం చేయాలంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమవుతున్న కథనాలకు స్థానిక ఎమ్మెల్యే చొరవతో జిల్లా కలెక్టర్ కదిలారు. వాస్తవాలను నిగ్గుతేల్చే పనిలో పడ్డారు. అందులో భాగంగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనితో కలిసి సోమవారం 7వ దశ పరిపాలనా పరిధిలోని పాత ప్లాంట్‌ను సందర్శించారు. స్క్రాప్ తరలింపు టెండర్‌లో జరిగిన అవకతవకలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తాను గత నెల 21న సందర్శించనప్పుడు పనులు నిలిపివేయాలని చెప్పినప్పటికీ, ఎందుకు నిలిపివేయలేదని కేటీపీఎస్ అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు. కేటీపీఎస్ అధికారులు అన్ని విషయాల్లో నిబద్ధతగా ఉంటే వాస్తవాలను బహిర్గతం చేయాలని అన్నారు. అనంతరం కూనంనేనితో కలిసి టెండర్ షెడ్యూల్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. అనంతరం పాత ప్లాంట్‌లోని కూలింగ్ టవర్ల కూల్చివేతకు బదిలీపై వెళ్లిన కలెక్టర్ పాత డేట్‌తో అనుమతులు ఇచ్చారనే విషయాన్ని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఆ విషయంపై పూర్తి స్థాయి విచారణ చేపడతానన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఫోన్ చేసినా కేటీపీఎస్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్క్రాప్ తరలింపుపై వస్తున్న ఆరోపణలను, ఇక్కడ చోటు చేసుకున్న పరిణామాలను రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించి, నిర్ణయం తీసుకుంటానని అన్నారు. తననుంచి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు స్క్రాప్ సేకరణ, తరలింపు ప్రక్రియను నిలిపివేయవలసిందిగా ఆదేశించడం జరిగిందని అన్నారు. కేటీపీఎస్ 7వ దశ అధికారులు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, ఉప్పుశెట్టి రాహుల్ తదితరులున్నారు.

ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● ఐటీడీఏ పీవో రాహుల్



మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, జూలై 1: గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకొని నదీ పరివాహక ప్రాంతంలోని అధికారులు ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గోదావరి వరద సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముంపు ప్రాంత గ్రామాలను గతంలో మాదిరిగా గుర్తించి వారికి సంబంధించిన పునరావాస కేంద్రాలను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. అలాగే ముంపు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలన్నారు. వరదల సమయంలో ఉద్యోగులెవరు అనుమతి లేకుండా ముందస్తు సెలవులు తీసుకోవద్దని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో మంచినీరు సరిపడా ఆహారం, మందులు అందుబాటులో ఉండాలని అన్నారు. అలాగే విద్యుత్తు సరఫరా పునరావాస కేంద్రాల్లో 24 గంటలు ఉండాలని, వరద బాధితులకు కల్పించే మౌళిక వసతుల్లో ఎటువంటి ఇబ్బం దులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయం ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజు, డీడీ మణెమ్మ, ఆర్డీవో దామోదర్‌రావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, డీఈ తిరుపతి, ఏఈ రాము తదితరులున్నారు.

నేటి నుంచి భద్రాద్రి రామాలయంలో బ్రేక్ దర్శనం

భద్రాచలం జూలై 1: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం నుంచి భక్తుల సౌకర్యార్థం బ్రేక్ దర్శనం అమలు చేయనున్నారు. ప్రతీరోజు వచ్చే భక్తులకు ఉదయం 9 గంటల నుంచి 9:30 వరకు, అలాగే రాత్రి 7 గంటల నుంచి 7:30 మధ్య బ్రేక్ దర్శనాన్ని అమలు చేయనున్నారు. ఈ బ్రేక్ దర్శనంలో వెళ్లాలనుకునే భక్తులు రూ.200 రూపాయల టికెట్ కొనుగోలు చేయాలని దేవస్థానం అధికారులు తెలిపారు. బ్రేక్ దర్శనం సమయంలో ఉచిత, స్పెషల్, అంతరాలయ అర్చనలను తాత్కాలికంగా నిలుపుచేయనున్నట్లు దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా ఆలయంలో విశేషకార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహిస్తున్న సమయంలో అవసరానికి అనుగుణంగా బ్రేక్ దర్శనం రద్దు చేయడం, వాయిదా వేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. నేటి నుంచి అమలు చేయనున్న బ్రేక్ దర్శనం సౌకర్యాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరుతున్నారు.

డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు బహుమతులు

» నేటి నుంచి అమలు » ఆర్ఎం సరిరాం వెల్లడి

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 1: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిదిలోని అన్ని డిపోలోని డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు నేటి నుంచి ప్రత్యేక బహుమతులు అందించడం జరుగుతుందని రీజనల్ మునుజర్ సరిరాం తెలిపారు. నెలలో రెండు సార్లు 15 రోజుల కొకసారి లక్కీడ్రా ద్వారా ముగ్గురు విజేతలను ఖమ్మం నగరంలోని ఆర్ఎం కార్యాలయంలో ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. డీలక్స్ బస్సులో ప్రయాణించిన మహిళలు టికెట్ తీసుకొని, ఆ టికెట్ వెనుకాల పేరు, మొబైల్ నెంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్స్‌లో దిగే సమయంలో వేయాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో మొత్తం 24 డిలక్స్ బస్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలు ఈ కొత్త పథకాన్ని సద్వినియోగం చేసుకొని డీలక్స్ బస్సుల్లో ప్రయాణించాలని ఆర్ఎం కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ఖమ్మం రూరల్, జూలై 1: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని పోలేపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పోలేపల్లి గ్రామానికి చెందిన కొండం వీరబాబు (29) తన పొలంలో ఉన్న బావి వద్ద ఉన్న మోటార్ ఆన్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.

గుండెపోటుతో యువకుడు...

ఖమ్మంక్రైం, జూలై1: గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముదిగొండ మండలం, గందసిరి గ్రామానికి చెందిన ఎస్‌కె సలీం(31) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల అతడికి ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రికి వెళ్లగా వైద్యులు పరీక్షలు చేసి గుండె కామెర్లు వచ్చినవని చెప్పారు. కాగా సోమవారం అతడు ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేసుకుని ఖమ్మంలోని అల్లిపురం జంక్షన్ వద్ద ఉన్న ఇసుక ట్రాక్టర్ల అడ్డా వద్దకు వచ్చాడు. అక్కడ టిఫిన్ చేసి కుర్చోని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో అక్కడున్న మిగతా డ్రైవర్లు పరిశీలించగా, అప్పటికే మృతి చెంది ఉన్నాడు.. అనంతరం పోలీసులకు సమాచారం అందించి మృతదేహన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకు తరలించారు. ఈఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రూ.10వేల ఫెన్సింగ్ తీగ చోరీ

చింతకాని, జూలై 1: పొలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ తీగను గుర్తు తెలియని దొంగలు ఆదివారం రాత్రి అపహరించిన సంఘటన మండల పరిధిలోని నేరడ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చెవుల తిరుపతిరావుకు గ్రామ సమీపంలో పొలం ఉండటంతో పత్తి సాగు చేశాడు. కాగా సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా సుమారు 30 రాళ్లకు కట్టిన తీగ జాలిని దొంగలు అపహరిండాన్ని గుర్తించాడు. ఆఖరికి పొలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ తీగలను దొంగలు అపహరించడంపై రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఫెన్సింగ్ విలువ సుమారు రూ.10వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

నూతన చట్టాలపై న్యాయవాదుల నిరసన



నిరసన తెలపుతున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్ జూలై 1: ప్రజావ్యతిరేక నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలని కోరుతూ న్యాయవాదులు సోమవారం ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ చట్టాలను ఉద్దేశించి సీనియర్ న్యాయవాది వడ్డెల కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ రోజు చీకటి రోజు అని వర్ణించారు. ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్ మాట్లాడుతూ ఈ కొత్త క్రిమినల్ చట్టాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మూడు కొత్త క్రిమినల్ చట్టాలు సోమవారం నుంచి అమలులోకి వస్తున్నాయని, ఈ మూడు చట్టాలు బాధితులకు అనుకూలంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతుంది, కానీ అలా ఉన్నట్లుగా అనిపించడం లేదని పేర్కొన్నారు. అందుకు ఉదాహరణగా ప్రథమ సమాచార నివేదికను పేర్కొనవచ్చు అని అన్నారు. వివిధ సంఘాల న్యాయవాదులు మాట్లాడుతూ ఈ చట్టాలకు వ్యతిరేకంగా న్యాయవాదులు ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ నాయకుడు పొట్ల మాధవరావు, కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, ఐలు నాయకులు ఏడునూతల శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వరరావు, ఎన్.నవీన్‌చైతన్య, చింతనిప్పు వెంకట్, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకుడు మేకల సుగుణరావు, రాంమూర్తి, తిరుమలరావు, కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి, పి.దానయ్య, ఆకుల శేఖర్‌బాబు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

విషమంగానే 'పేట' ఎస్ఐ ఆరోగ్య పరిస్థితి

● హైదరాబాద్ యశోదలో చికిత్సపొందుతున్న ఎస్ఐ

అశ్వారావుపేట, జూలై 1: ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆరోగ్యపరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. మహబూబాబాద్ జిల్లాలో ఆదివారం రాత్రి ఎస్ఐ పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి విదితమే. కాగా స్థానిక పోలీసులు ఎస్ఐను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమిస్తుండటంతో ఆయనను హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన యశోదలో ఐసీయూలో ఉంచి వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఆయన సేవించిన కలుపు మందు వల్ల రెండు కిడ్నీలపైన ఎఫెక్ట్ పడిందని, వాటికి వైద్యులు చికిత్సలు చేస్తున్నారనేది విశ్వసనీయ సమాచారం. అయితే ఆయన ప్రస్తుతం వైద్యానికి స్పందిస్తున్నారు. ఆయనను చూడటానికి వెళ్లిన వారితో మాట్లాడుతున్నట్లు కూడా చెబుతున్నారు. ఏదేమైన ఒకటి రెండు రోజులు తరువాతే పరిస్థితి ఏమిటనేది తెలుస్తుంది. అయితే ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు ఇంత వరకు బైటకు రాలేదు. డిపార్ట్‌మెంట్‌లో అంతర్గత విషయాలవల్ల జరిగిందా? వేరే కారణాలేమైన ఉన్నాయా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పోలీస్ శాఖాధికారులు కాని, కుటుంబ సభ్యులు కాని ఇంత వరకు దీనిపై ఎవ్వరూ బహిరంగంగా స్పందించకపోవడంతో ఏమి జరుగిందనేదానిపై స్పష్టత లేదు. పోలీస్ ఉన్నతాధికారులు కూడా దీనిపై అంతర్గతంగా పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

దీనిపై అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఎస్ఐ శ్రీను ప్రస్తుతం హైదరాబాదు యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆత్మహత్యాయత్నానికి కారణాలు ఇప్పటి వరకు ఏమి తెలియలేదని, దీనిపైనే విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్ఐని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్యపరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంచి వైద్యం అందించాలని వైద్యులను కోరినట్లు ఆయన తెలిపారు.

మానవత్వం చాటిన ఎన్నారైలు

» ఇటీవల అమెరికాలో మృతి చెందిన కిరణ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు రూ.20లక్షల వితరణ

» చిన్నకోరుకొండి పాఠశాల పూర్వ విద్యార్థులు సైతం చేయూత » దాతలను కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం



కిరణ్(ఫైల్)

కల్లూరు, జూలై 1: ఇటీవల అమెరికాలో మృతి చెందిన ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి శ్రీనాథరాజు కిరణ్‌కుమార్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఎన్నారైలు తమ వంతుగా ఆర్థిక సాయం అందించారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన శ్రీనాథరాజు కిరణ్‌కుమార్ ఎంఎస్ చదివేందుకు తాత శ్రీనాథరాజు కృష్ణమూర్తిరాజు ప్రోత్సాహంతో అమెరికా వెళ్లాడు. ఇందుకోసం కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులు ఎకరం పొలం, ఇల్లు కూడా విక్రయించారు. గత శనివారం తన మిత్రబృందంతో కలిసి అమెరికాలోని ఓ అపార్టుమెంట్ సమీపంలో స్విమ్మింగ్‌పూల్‌కు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి కిరణ్‌కుమార్ మృతి చెందిన విషయం విదితమే.

ఈ సంఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం అమెరికాలో ఉన్న ఎన్నారైల హృదయాలను కదిలించింది. దాంతో ఆమెరికాలోనే ఉన్న చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన (ఎన్నారైలు) తిరుమలశెట్టి గోపి, కమ్మంపాటి అంజేనేయులు, మాదిరాజు శ్రీనివాసరావులు శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనాన్ని ఆన్‌లైన్‌లో చదివి తరువాత దాన్ని అమెరికాలో ఉన్న తెలుగు వారందరి సోషల్ మీడియా గ్రూప్‌లలో పోస్ట్ చేశారు. దీంతో ఎంతో మంది తెలుగు ఎన్నారైలు కిరణ్ మృతదేహాన్ని స్వదేశానికి పంపేందుకు ముందుకు వచ్చి తమ వంతుగా రూ.20 లక్షలు వితరణ చేశారు. గురువారం నాటికి కిరణ్ మృతదేహం స్వగ్రామానికి చేరుకునే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు.

కిరణ్ స్వగ్రామమైన చిన్నకోరుకొండి గ్రామంలో కిరణ్ అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థానికంగా ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు, మిత్రబృందం కూడా తాము సైతం అంటూ ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చారు. అమెరికా నుంచి విమానంలో మృతదేహం హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే అక్కడ నుంచి స్వగ్రామమైన చిన్నకోరుకొండి గ్రామానికి తీసుకొచ్చేలా పాఠశాల పూర్వ విద్యార్థులు, కిరణ్ మిత్రులు రెడ్డి గోపి, చినాల శివ, రాజశేఖర్ తదితర మిత్రులు తమ వంతుగా సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. కిరణ్ తాత కృష్ణమూర్తిరాజు స్థానిక రామాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు కావటంతో ఆ గ్రామంలో వారి కుటుంబానికి మంచి పేరు ఉంది. దీంతో గ్రామ ప్రజలు కూడా చేయూతనిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిసింది. కిరణ్ కూడా చిన్నకోరుకొండి ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతంగా రాణించాడు. ఆ క్రమంలోనే ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు.

ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి

● తిరిగి బాధితుడికి అప్పగించిన సైబర్‌క్రైం పోలీసులు



బాధితుడికి బ్యాంక్ డ్రాఫ్ట్‌ను అందిస్తున్న సైబర్ క్రైం డీఎస్పీ ఫణీందర్

ఖమ్మంక్రైం, జూలై1: సైబర్‌మోసంలో ఆన్‌లైన్ ద్వారా నగదు పోగొట్టుకున్న బాధితుడికి సైబర్‌క్రైం డీఎస్పీ సీహెచ్‌ఆర్వీ ఫణీందర్ బ్యాంక్ డ్రాఫ్ట్‌ను సోమవారం అప్పగించారు. కల్లూరు మండలం పెద్దకోరుకొండికి చెందిన వేల్పుల సంపత్‌కుమార్ ఇటీవల సైబర్ నేరస్తులు ఆన్‌లైన్ మోసం ద్వారా డబ్బులను కాజేశారు. బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు పోగొట్టుకున్న డబ్బులను గత నెలలో జరిగిన లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించి కొటక్ మ హీంద్రాబ్యాంకు వారి డిమాండ్ డ్రాఫ్ట్‌ను బాధితుడికి అప్పగించారు. ఈసందర్భంగా బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

● ఒకరికి గాయాలు

ఖమ్మంక్రైం, జూలై1: ఓలారీ అతివేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన సోమవారం తెల్లవారుజామున ఖమ్మం నగరంలో జరిగింది. హైదరాబాద్ నుంచి ఖమ్మం మీదుగా ఏపీ39యూఎల్ 6788 నెంబరు గల ఓ లారీ టైల్స్ లోడ్‌తో వైరా వైపు వెళుతుంది. నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు రాగానే నిద్ర మత్తులో ఉన్న లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి అక్కడ ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఈసంఘటన తెల్లవారుజామున జరగడంతో ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. సోమవారం మధ్యాహ్నం పోలీసులు క్రేన్ ద్వారా లారీను అక్కడి నుంచి తొలగించారు.



డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ దృశ్యం

రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు, జూలై 1: ప్రజల వద్ద నుంచి జూలూరుపాడు గ్రామానికి చెందిన వ్యాపారి కొమ్మిన్ని నాగేశ్వరరావు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన సోమవారం జూలూరుపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సదరు వ్యాపారి గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాడు. సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లగా 5 క్వింటాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తిరపతిరావు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

సీయూఈటీలో భూమికకు 24వ ర్యాంకు



భూమిక

ముదిగొండ, జూలై 1: ముదిగొండకు చెందిన కమర్తపు భూమిక సీయూఈటీ కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్టులో ఆలిండియా 24వ ర్యాంకు సాధించింది. పదోతరగతి వరకు వెంకటాపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివి, ఇంటర్, డిగ్రీని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో పూర్తి చేసింది. కమర్తపు నిరంజన్, సుజాత దంపతుల కుమార్తె భూమిక జేఎన్‌యూ డిల్లీలో ఏఎంయూ సోషలాజీలో ప్రతిభ కనపర్చి ఉత్తమ ర్యాంకు సాధించినందుకు భూమికను తల్లిదండ్రులు, స్నేహితులు అభినందించారు.

'ప్రీస్కూల్ విద్యావిధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలి'

టేకులపల్లి, జూలై 1: అంగన్‌వాడీ కేంద్రాలల్లో ప్రీస్కూల్ విద్యావిధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో మంగతార అన్నారు. సోమవారం జాతీయ విద్యా విధానంలో భాగంగా మండలంలోని బేతంపూడి స్టేజి పాఠశాలలో టేకులపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ నిర్వహణపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రీస్కూల్ విధానం ద్వారా చిన్నారుల్లో మేధోశక్తి పెంపొంతుందన్నారు. మూస విధానంతో కొనసాగే బోధనకు స్వస్తిపలుకుతూ చిన్నారుల్లో ఆలోచనలు రేకెత్తిస్తూ మేధోశక్తిని పెంపొందించేందుకు గాను ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. ప్రీస్కూల్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తామని శిక్షణ పొందిన అందన్‌వాడీ టీచర్లు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గణేష్‌గాంధీ, బీసీ కోఆర్డినేటర్ నాగిరెడ్డి, సూపర్‌వైజర్లు అను రాధ, సక్కుబాయి, లక్ష్మి, నిర్మల, విజయకుమారి, యశోదమ్మ, కలీదాబేగం, స్వరాజ్యలక్ష్మి తదితరులున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

డీలక్స్ బస్సుల్లో మహిళలకు గిఫ్ట్ స్కీమ్: సత్తుపల్లి డీఎం

సత్తుపల్లిరూరల్, జూలై1: ఆర్టీసీని మహిళలు ఆదరించాలనే ఉద్దేశ్యంతో విజయవాడ రూట్‌లో డీలక్స్ బస్సులకు గిఫ్ట్ స్కీమ్ ప్రవేశపెట్టినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మీ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ విజయవాడ రూట్‌లో సత్తుపల్లికి చెందిన డీలక్స్ బస్సులు ఆరు సర్వీసులు నడుస్తున్నట్లు చెప్పారు. మహిళా ప్రయాణికుల కోసం ఈ స్కీమ్ ప్రవేశపెట్టామన్నారు. ప్రయాణం అనంతరం గమ్యస్థానం చేరుకున్న తర్వాత టికెట్ వెనుక పేరు, మొబైల్ నంబర్ రాసి డ్రైవర్ వెనుక ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీమ్ బాక్సులో వేయాలని కోరారు. అయితే ప్రతీ 15రోజులకు ఒకసారి అనగా నెలలో 1, 17వ తేదీల్లో రీజియన్ స్థాయిలో జిల్లా కేంద్రంలో ముగ్గురు విజేతలను ప్రకటిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళా ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని డీఎం కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సిలివేరు సాహితీ, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మంకలెక్టరేట్, జూలై 1: ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి, త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల నుంచి బోడ సక్రియా, తనకు పుట్టకోట గ్రామంలో సర్వే నెం.39లో 12 కుంటల భూమి ఉన్నట్లు, పాస్‌బుక్ ఇప్పించాలని కోరగా, ఖమ్మం అర్బన్ తహశీల్దార్‌ని అదనపు కలెక్టర్ పరిష్కారానికి ఆదేశించారు. పెనుబల్లి మండలం చౌడవరం నుంచి గుర్రం వెంకటేశ్వరరావు, తనకు వినికిడి లోపం ఉన్నట్లు, ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్‌స్కీంకు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు ఓ ప్రైవేటు యాజమాన్యం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వలేదని, విద్యార్థుల తల్లిదండ్రులు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కారేపల్లి గ్రామం, సింగరేణి మండలం నుంలో ఇనాం భూమి కబ్జాకు గురయిందని తిరిగి దాన్ని ఇప్పించాలని అలగడి పద్మ ఫిర్యాదు చేశారు. ఖమ్మం నుంచి ముదిగుండ్ల నాగ అనిల్ కుమార్, తాను మూగ, చెవిటి వాడినని, డిగ్రి చదివానని, ఉపాధి కల్పించాలని, సింగరేణి మండలానికి చెందిన కొమ్ము ఉపేంద్రయ్య తనకు 2020-21లో ఎస్సియాక్షన్ ప్లాన్ క్రింద మంజూరైన రుణానికి సబ్సిడీ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, జడ్పీ సీఈవో ఎస్.వినోద్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నగర పాలక సంస్థ గ్రీవెన్స్‌కు 17 ఫిర్యాదులు

నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంకార్పొరేషన్: గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం 17 అర్జీలు రాగా, వాటిని సంబంధిత అధికారులకు అందించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి పాల్గొన్న గ్రీవెన్స్‌లో ఆయన మాట్లాడుతూ గత గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉంటే వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలించవలసిన వాటిని ఆయా ప్రాంతాలకు వెళ్లి తనిఖీలు చేయాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను మళ్లీ గ్రీవెన్స్ నిర్వహించే రోజువరకు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో రెవెన్యూఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, జనన,మరణ విభాగం అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

సీతారామా భూసేకరణ పరిహారంలో అక్రమాలు

కలెక్టర్‌కు యాతాలకుంట గ్రామస్థుల పిర్యాదు

సత్తుపల్లి,జూలై1 :సీతారామా ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో జరిగిన భూసేకరణలో రూ.కోటి పైగా అక్రమాలు జరిగినట్లు యాతాలకుంట గ్రామానికి చెందిన కొందరు ఆరోపిస్తున్నారు. ఈమేరకు సోమవారం ఖమ్మంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీతారామా కాలువల తవ్వకాల కోసం భూసేకరణలో భాగంగా యాతాలకుంటలో 135.26గుంటల భూమి సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. సర్వే సమయంలో ఇదే గ్రామానికి చెందిన రెవెన్యూలో పని చేసే ఒక ఉద్యోగి, అప్పట్లో ఒక సర్వేయరు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక కుటుంబానికి చెందిన నలుగురి పేరుతో 6 ఎకరాల 20గుంటల భూమి మాత్రమే ఉందని, దీనిలో భూసేకరణలో 4ఎకరాల 20గుంటల భమిని సేకరించారని పేర్కొన్నారు. పక్క రైతులకు చెందిన 75, 76, 77 సర్వే నెంబర్లలో భూమిని కలిపి మొత్తం 18 ఎకరాల 20గుంటల భూమికి అక్రమంగా పరిహారం పొందటానికి సర్వేలో నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. ఇప్పటికే 6.08 గుంటల భూమికి పరిహారం డబ్బులు వారి ఖాతాల్లో జమయ్యాయని, మిగిలిన 12ఎకరాల 12గుంటల భూమికి అక్రమంగా పరిహారం పొందేందుకు సిద్ధంగా ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి బంధువులు కావటంతో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. యాతాలకుంటలో జరిగిన భూసేకరణ, పరిహారం పంపిణీపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరారు.

పెసరలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వైరా, జూలై 1: ఖరీఫ్‌లో సాగుచేసిన పెసర పైరులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల సూచించారు. మండలంలోని గరికపాడులో సాగు చేసిన పెసర పైరును క్షేత్రస్థాయిలో సోమవారం ఆమె పరిశీలించారు. ఏఏ రకాల పెసర సాగుచేశారని రైతులను అడిగి తెలుసుకున్నారు. పెసర, పత్తి వంటి పైర్లకు కురుస్తున్న వర్షాలకు అనుకూలంగా ఉన్నాయని ఈ తరుణంలో పెసరలో తెగుళ్ల సోకకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏవో ఎస్.పవన్‌కుమార్, ఆదర్శరైతులు తుమ్మల రాణాప్రతాప్, శీలం నాగిరెడ్డి, గడిపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంకార్పొరేషన్, జూలై1: నగరంలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 44వ డివిజన్‌లో రూ.48లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్‌ట్యాంక్‌ను మేయర్ ప్రారంభించారు. డివిజన్‌లో 198 నల్లా కనెక్షన్‌లు మంజూరు చేయించి, ఈ వాటర్‌ట్యాంక్ ద్వారా తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్ పాలెపు విజయ, పబ్లిక్‌హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ నారాయణ విద్యాసంస్థలను అభినందించిన ఎమ్మెల్యే


ర్యాంకర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, జులై1: సత్తుపల్లికి మంచి పేరు తేవడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను మేలిమి వజ్రంలా తయారు చేస్తున్న శ్రీ నారాయణ విద్యాసంస్థలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అభినందించారు. ఇటీవల బెటర్‌మెంట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన స్థానిక గుడిపాడులో కళాశాల విద్యార్థులను సోమవారం కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. విద్యాసంస్థ ప్రారంభించిన మొదటి ఏడాదే ఉత్తమ ఫలితాలు సాధించడం ఒక్క శ్రీ నారాయణ విద్యాసంస్థకే దక్కిందన్నారు. స్టేట్‌ఫస్ట్ ర్యాంక్ పొందిన శ్రీసఖ వరుణ్ (467/470), 467మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన ఆకాష్, గోవర్ధన్, అజయ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎన్‌సీహెచ్. రామకృష్ణమాచార్యులు, డైరెక్టర్ వనమారెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ రాజాకృష్ణ, కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్టులకు సన్మానం

వైరా,జూలై1:మండలంలోని పాలడుగులో సోమవారం ప్రజా ఉద్యమాల్లో నిబద్ధతతో పనిచేస్తున్న 80ఏళ్ల పైబడిన కమ్యూనిస్టు నాయకులను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు సన్మానించారు. 80ఏళ్ల పైబడిన ఈ కమ్యూనిస్టు నాయకులు దాదాపు 60ఏళ్ల నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమవంతు ఉద్యమాలు నిర్వహిస్తున్నారని, వీరి పోరాటం యువతకు ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. షేక్.అబ్దుల్‌రెహ్మాన్, షేక్.. మౌలాలి, యాకూబ్‌అలి, వనమా చిన్నసత్యనారాయణ, శంకరయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాగు విస్తీర్ణం మొత్తానికి రైతు భరోసా ఇవ్వాలి

వైరా,జూలై1: వ్యవసాయశాఖ అధికారుల నివేదిక ప్రమాణికంగా సాగుచేసిన విస్తీర్ణం మొత్తానికి రైతు భరోసా ఇవ్వాలని రైతులు కోరారు. మండలంలోని గరికపాడు, పూసలపాడు సొసైటీల్లో సోమవారం రైతులతో జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి రైతుభరోసా పథకం అమలుకు సంబంధించి వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. గరికపాడు సొసైటీ అధ్యక్షుడు అయిలూరి కృష్ణారెడ్డి, పూసలపాడు సొసైటీ ఉపాధ్యక్షుడు గారపాటి గోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో స్పెషలాఫీసర్ అయిన జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల పాల్గొని రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. కొంతమంది రైతులు పదెకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలని కోరగా మెజార్టీ రైతులు మాత్రం ఎకరాలతో సంబంధం లేకుండా సాగు విస్తీర్ణం మొత్తానికి రైతుభరోసా ఇవ్వాలని స్పష్టం చేశారు. వైరా ఏవో ఎస్.పవన్‌కుమార్, సహకార శాఖకు చెందిన జగదీష్, ఇందుమతి, ఉషారాణి, ఏఈవో సైదులు, కీర్తి, సొసైటీ సీఈవోలు ఏ.రామకృష్ణ, అశోక్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మధిరటౌన్, జూలై1: వ్యవసాయం చేసే ప్రతీ రైతుకు రైతుభరోసా ఇవ్వాలని మధిర సొసైటీ అధ్యక్షుడు బిక్కి కృష్ణప్రసాద్, పలువురు రైతులు అభిప్రాయ పడ్డారు. సోమవారం మధిరలోని రైతువేదికలో మధిర రైతుసేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలను తీసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సహకార శాఖ అధికారులు కుషిద్‌అలీ, సందీప్, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం

నేలకొండపల్లి: రైతుభరోసా పథకంపై అన్నదాతల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా రిజిస్ట్రార్ నీరజ పేర్కొన్నారు. సోమవారం నేలకొండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతుల సర్వసభ్య సమావేశాన్ని అధికారులు రైతువేదికలో నిర్వహించారు. సమావేశానికి జిల్లా రిజిస్ట్రార్ హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న రైతులు అభిప్రాయాలను వెల్లడించారు. మెజారిటీ రైతులు 10ఎకరాల రైతులకు రైతుభరోసా కల్పిస్తే సరిపోతుందన్నారు. మరికొంత మంది ఎటువంటి షరతులు లేకుండా గతంలో మాదిరే ఇవ్వాలని సూచించారు. ఈ డిప్యూటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లుశ్రీదేవి, కల్యాణి సమావేశంలో మండల వ్యవసాయాధికారి అరుణ, సంఘ పాలకవర్గ సభ్యులు మైసా శంకర్, తీగ రమణయ్య, కనక రాజులతో పాటుగా రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

వైరాలో వనమహోత్సవం



వైరా, జూలై1: వైరాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ సీహెచ్.వేణు, సిబ్బంది గురుకులం ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు మొక్కల నాటారు. ప్రతి ఒక్కరూ తమవంతుగా ఒక్కో మొక్క నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్.సైదులు, మెప్మా ఆర్‌పీ బండారుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ ముస్కాన్’ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జూలై1: తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులకు అభయహస్తం అందించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-10లో భాగంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను సీపీ తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీపీసీపీలు ప్రసాదరావు, నరేష్‌కుమార్, ఏసీపీలు నరసయ్య, సుశీల్‌సింగ్, ఆర్ఐ కామరాజు, ఎస్ఐలు శ్రీకాంత్, సీసీఆర్‌బీఎస్ఐ జ్యోతి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించిన సీపీ

ఖమ్మంక్రైం: ఇటీవల పోలీసుశాఖలో ఉద్యోగ విరమణ పొందిన అధికారులను పోలీసుకమిషనర్ సునీల్‌దత్ తన కార్యాలయంలో సోమవారం సత్కరించారు ఉద్యోగ విరమణ పొందిన సీఎస్బీ ఎస్ఐలు గోపాలకృష్ణ, అప్పారావు, ట్రాఫిక్ ఎస్ఐ విష్ణుమూర్తి, త్రీటౌన్ ఎస్ఐ సుబ్బారావు, ఏఆర్ఎస్ఐ ఉపాధ్యాయ్, హెచ్‌సీ కృష్ణయ్య, రంగాచార్యులు, పి. అప్పారావును సీపీ సన్మానించారు పోలీసుశాఖలో ఎనలేని సేవలతో విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీలు ప్రసాదరావు, నరేష్‌కుమార్, సుశీల్‌సింగ్, కామరాజు, పోలీసు అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ కోత

కల్లూరు,జూలై1: కల్లూరు 33-11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సాంకేతిక మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక సబ్ స్టేషన్ ఇంజనీర్ గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముగ్గువెంకటాపురం, పేరువంచ గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

రఘునాథపాలెం,జూలై1: కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాల జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం చిమ్మపూడిలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. నాయకులు బషీరుద్దీన్, చింతల రమేశ్, దొంతు గణేష్ పాల్గొన్నారు.

4న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్ జూలై1:ఈనెల4న సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్-08,10,12 బాలురు, బాలికల అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలోతెలిపారు. జిల్లాజట్టుకు ఎంపిక చేస్తామన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

వేంసూరు, జూలై 1: వేంసూరు మండలం లింగపాలెం యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు గండ్ర జయ ఆ పాఠశాలకు విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పలకలు సోమవారం పంపిణీ చేశారు. రేజర్ల గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌కు చెందిన శివప్రసాద్, దారా కృష్ణారావు కాపా మురళీకృష్ణ, కొత్తూరి ప్రభాకర్ రావు, గండ్ర సోమిరెడ్డి, పెనుగొండ రమేష్, వెల్ది జగన్మోహన్‌రావు, దొడ్డా కృష్ణయ్య, లింగారెడ్డి, ఎంఈవో వెంకటేశ్వరరావు, యర్రా సత్యం,వెల్ది ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజనసంఘం ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలపై సర్వే

కొణిజర్ల, జూలై1: మండల కేంద్రానికి అనుకొని ఉన్న బస్వాపురంలోని బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గిరిజనసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భూక్యా వీరభద్రం కోరారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థు నుంచి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తేజావతు సీతరాములు, బానోతు హరిచంద్, ధరావత్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఖమ్మం రూరల్,జూలై 1: మండలంలోని ఏదులాపురం, పెద్దతండా, కోదాడక్రాస్‌రోడ్డు, పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని ఏఈ క్రాంతిసింహ సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. చెట్లు, కొమ్మలు తొలగించే కార్యక్రమంలో భాగంగా విద్యుత్‌కోత ఉంటుందని చెప్పారు.

పోడుభూములకు పట్టాలు ఇవ్వాలి

కొణిజర్ల, జూలై1: మండలంలోని ఎల్లన్ననగర్‌లో గిరిజనపేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ సోమవారం సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ నాయకులు నునావత్ శ్రీనువాస్, మోతిలాల్, శ్రీను, కీమ్య, నీల, చీన్య, మత్రు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

ఏసీపీ రహమాన్

కొణిజర్ల, జూలై1: విద్యార్థులు పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని వైరా ఏసీపీ రహమాన్ ఆకాంక్షించారు. సోమవారం స్థానిక గ్రేస్‌పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాల పంపిణీ చేశారు. చదువు ద్వారా లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ సిబ్బంది ప్రసాద్, అజయ్‌కుమార్, శ్రీవేణు, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,జూలై1: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారెంటీ పథకాలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీసమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండటం వల్ల ప్రజలకు ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారన్నారు. నాయకులు ఝాన్సీ, లక్ష్మణ్, ప్రేమ్‌సింగ్, సురేశ్, రాకేష్, కే శ్రీను పాల్గొన్నారు.

మాలలు ఉద్యమానికి సిద్ధం కావాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై1: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు అంతా ఐక్యమత్యంతో ఉద్యమానికి సిద్ధంకావాలని మాలమహానాడు నాయకులు గుంతేటి వీరభద్రం తెలిపారు. సోమవారం గరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మాలమహానాడు విస్తృతస్థాయి సపమావేశం నిర్వహించారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోండి

నేలకొండపల్లి,జూలై1: సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల కార్యదర్శి పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ ఎర్రయ్యకు వినతిపత్రం అందించారు. అన్ని గ్రామాల్లో పారిశుద్యంపై ప్రజలను చైతన్యం చేయాలని వినతిపత్రంలో కోరారు. మండల కార్యదర్శి పాగర్తి సుధాకర్, బాజా రామకృష్ణ, సయ్యద్ మొహినుద్దీన్, పిట్టల సూరిబాబు, కందికొండ రమణ, గండారపు వెంకటేశ్వర్లు తదితరులువినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

బీసీ వసతిగృహ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు,జులై1: ఏన్కూరు బీసీవసతి గృహంలోకి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహ సంక్షేమ అధికారి కరుణాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడోతరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. చేరదలిచిన విద్యార్థులు ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, కులం, ఆదాయం, రెండుపాస్‌పోర్టు ఫోటోలు తీసుకురావాలన్నారు.

సత్తుపల్లి తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి

34ఓట్ల తేడాతో గెలుపొందిన అధ్యక్షుడు



సత్తుపల్లిరూరల్, జులై1: సత్తుపల్లి తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలలో కత్తి కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు.మునుపెన్నడూ లేనివిధంగా యూనియన్ ఎన్నిక ఈసారి నిర్వహిం చడంతో పోటీ హోరాహోరీగా మారింది. సోమవారం పట్టణంలోని తాపీ వర్కర్స్ యూనియన్ భవనంలో ఎన్నిక నిర్వహించారు. యూనియన్‌లో మొత్తం 418 మంది సభ్యులుగా ఉండగా ఎన్నికలో 250మంది పాల్గొని ఓట్లు వేశారు. కత్తి కృష్ణారెడ్డి(101), బొర్రా నాగయ్య(67), నెక్కంటిశేఖర్(36), యేదుపాటి భాస్కర్‌రావు (36) ఓట్లు రాగా నోటాకు 10ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికలో సమీప ప్రత్యర్థి నాగయ్యపై కృష్ణారెడ్డి 34ఓట్ల తేడాతో గెలుపొందారు. వచ్చేనెలలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఉంటుందని బాధ్యులు తెలిపారు.ఈ కార్యక్రమం లో పిడుగు వెంకటేశ్వరరావు, ఎస్కే.షైబు, ఎస్కే.నజీర్, సుబ్బారావు, మహేష్, గుంజా వెంకటేశ్వరరావు, పోలయ్య, మధు, ఖాసీం, శ్రీను, బ్రహ్మారెడ్డి, లక్ష్మారెడ్డి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. కార్మికులు బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. కృష్ణారెడ్డిని అభినందించారు.

ఏఎన్‌ఎంల సమస్యలపై వినతి

ఖమ్మంకలెక్టరేట్, జూలై 1: ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ సెంట్రల్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరికి వినతి పత్రాన్ని అందచేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆమెను కలిసి ఏఎన్ఎంల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయం ఏవోకు కూడా వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వనం రంగదానం, చంద్రమోమన్, సంగమ్మ, ప్రమీల, తిరుపతమ్మ, భారతమ్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల విస్తృత పర్యటన

రఘునాథపాలెం, జూలై 1: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం విస్తృతంగా ఖమ్మం నియోజకవర్గంలో పర్యటించారు. ఉదయం నుంచి రాత్రి వరకు వరస కార్యక్రమాలతో బిజీ బిజీగా గడిపారు. 3వ డివిజన్‌లో ఇమ్మిడి వెంకటేశ్వర్లు పిల్లల వస్త్ర ఆలంకరణ వేడుకలో పాల్గొన్నారు. బూడిదంపాడులో కూరపాటి వెంకటరత్నం కుటుంబ సభ్యులను పరామర్శించారు. పుఠానీతండాలో ధరావత్ బాల కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. పంగిడి మాజీ సర్పంచి మోతిలాల్ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. కోయచెలక, రేగులచెలక గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమైనారు. జెడ్పీటీసీ ప్రియాంక, ఎంపీపీ భూక్య గౌరి, నాయకులు తుమ్మలపల్లి నర్సింహారావు, మందా గోపీ, బోయినపల్లి లక్ష్మణ్, జీ.రామకృష్ణ, ఏ వెంకటేశ్వర్లు, కళ్యాణపు నర్సయ్య, కలక ఫ్రాన్సిస్, నామా ప్రశాంత్ పాల్గొన్నారు.



ఘనంగా వైద్యుల దినోత్సవం



డాక్టర్ ప్రదీప్‌ను సన్మానిస్తున్న కమర్తపు మురళి తదితరులు, తల్లాడలో డాక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం


ఏన్కూర్‌లో..


ఖమ్మం మెడికల్ కళాశాలలో..